# పాతమంగలి

"ఒకనాడు మాటలసందర్భంలో తాతయ్యను ఉబ్బవేద్దామని—"తాతయ్యా! ముసలివాళ్ళంతా నీమాందిరిగా మారిపోతే, ఎంత బాగుండును!" అన్నాను నేను.

"ముసలివాళ్లు మారటం సంభవమా?" అన్నాడు తాతయ్య.

"ఏం, గాంధీ, ఠాకూరు..." నాలిష్టు పూర్తి కాలేదు.

"ఎబ్బే! వాళ్లుమార్తారటరా! మారితే ముసలివాళ్లెలా అవుతారు? అది కాదు, నేను మీసాలికి రంగు వేసుకుంటే మాత్రం పడుచువాణ్ణవుతానా? ఇలా అందని మానుకు అర్రులు సాచే, మంగలి అప్పలస్వామి పిచ్చివాడయాడు" అని తాతయ్య నిట్టూర్చాడు.

"ఎవరా అప్పలస్వామి? ఏమిటతనికథ?" అని నేను తాతయ్యని అడగాలి. అప్పుడాయన కాసేపు సాగదీయించుకుని కథ చెప్తాడు. ఒకవేళ నేను అడక్కుండా ఊరుకుంటినా, విసుక్కుంటాడు-చెప్పిందే మళ్లీ చెప్పి "ఏమిటి?" అని అడుగుతాడు. నాకివన్నీ తెలుసు. అందుకనే తాతయ్యని ఆ కథ చెప్పమని బతిమాలాను—, కాదు, బతిమాలినట్లు నటించాను.

తాతయ్య మరోసారి నిట్టూర్చి, కథ ప్రారంభించాడు:

"పదేళ్ళయిందనుకుంటాను, నేను రాజమండ్రినించి బదిలీ అయి ఆ ఊరుపోయి—

"ఏ ఊరు తాతయ్యా?"

"ఏ ఊరయితే ఏముందోయ్!-నీకంతగా తెలుసుకోవాలనే కోరిక ఉంటే రికార్డు చూసుకో, తెలుస్తుంది—నే, తర్వాత కథ విను...చార్జి తీసుకున్నాను. ఊళ్ళో చూడవలసిన పెద్దల్ని చూశాను. నన్ను చూడవలసినవాళ్లు ఒక్కొక్కళ్లే వచ్చి చూసిపోతున్నారు.

"మర్నాడు లేచి కాలకృత్యాలు తీర్చుకుని దంతధావన చేసుకుంటూ ఉండగా ఒక నడికారువ్యక్తివచ్చి నమస్కారం చేశాడు. నీరుకావిధోవతి కట్టి, ఉత్తరీయం ముసుగు వేశాడు. ఒడ్డూపొడుగూ దిట్టంగా ఉన్న మనిషి.

" నేను నమస్కారం రామార్పణ చేసి, 'ఏంపనిమీద వచ్చావు' అని అడిగాను.

"అతను కొంచెం నంగిగా, అతివినయంగా 'పెద్దవారిని దర్శించుకుపోటానికే, బాబయ్యా! నేను మంగలి అప్పల సామిని' అన్నాడు.

"అతనిచేతిలో పొదీ గిదీ లేదు. 'సరే. రేపు కనపడు' అన్నాను.

" 'రేపు అష్టమీ మంగళవారం బాబయ్యా!' అని చంకకను తగిలించిన తోలుపొది తీసి కిందపెట్టాడు.

"నేను గడ్డం తడవిచూసుకుని 'సరేకానివ్వు' అని బంట్రోతుని పిల్చి కుర్చీ పట్టుకురమ్మన్నాను. అప్పలసామి గాభరాపడి, నవ్వుకొట్టుతూ 'ఈ ఊళ్ళో కుర్చీమీద కూర్చోబెట్టి చేసే ఆచారం లేదు బాబయ్యా!' అన్నాడు. నేను విసుక్కుని, పీట తెప్పించాను.

"అప్పలసామి పొది మాంధాతకాలంనాటిది. మా

ముత్తాతదని అతనే చెప్పాడనుకుంటాను. కత్తులు నాటువి. వెడల్పుగా బరువుగా వున్నై. గడ్డం బాగా తడిపి, నిమ్మళంగా గొరిగాడు. కాని, నాకీ కత్తులు అలవాటు లేకపోవడంచేత చురుకు చురుకుగా ఉంది.

"అసలు, క్షురకర్మ ఇంటిదగ్గరకు మంగలిని పిలిపించి చేయించుకోటంలో సుఖముంది, ఆనందముంది. షాపుల్లో చేయించుకునే మీబోటివాళ్ళకి ఆ ఆనందం చెప్పితే అర్థం కాదు. మంగలి అంటే చిన్న స్కేలులో టాకీ వార్తాపత్రిక. పూర్వం మన తెలుగు పత్రికలు అభివృద్ధిలోకి రాలేదంటే, ఈ మంగళ్ల మూలానే. ఇప్పుడుకూడా అనేకమంది మంగళ్ల మూలాన్నే మన తెలుగు పత్రికల ప్రచారం అరికట్టబడింది. బాగా వాగగల మంగలి పత్రిక కొనడంలేదు. వాగలేనివాడు పత్రికకొని షాపులో వేస్తున్నాడు. ఈ రహస్యం తెలుసుకోలేక మా పత్రికలు ఖర్చు కావటం లేదో అని గోలపెడుతున్నారు పత్రికలవాళ్ళు.

"అప్పలసామి పనిచేస్తూనే ఊళ్లో విశేషాలు చెప్పాడు. ఫలాని ఫలానివాళ్లు పెద్దలన్నాడు. ఫలాని ఫలానివాళ్ళు పెద్ద మనుష్యులుగా కనపడతారన్నాడు. నేను వాళ్ళల్లో ఒక్కళ్ళని కూడా ఎరగను. ఇక నాదగ్గరనించి ఆరా తీసుకున్నాడు: పిల్లలు ఎంతమందీ, వాళ్ల ప్రాయాలూ, నాకు యేయే అధికార్లతో పరిచయమూ? యిలాంటివి. పని పూర్తి అయినాక కత్తీ, రాయీ పొదిలోపెట్టి, ఒక కాయితం తీసి ఇచ్చాడు. అది నాకు రెండు టరములకు పూర్వపు తహసీలుదారు గాని యిచ్చిపోయింది. దాంట్లో అతను యితని పనితనాన్ని పొగ

మూతూ 'సోమశత్రు' అని బిరుదిచ్చాడు.

"'రామ్మూర్తి పంతులుగారికి నేనంటే చాలా యిష్టం. నేనిప్పుడుండే ఇళ్లస్థళం వారిప్పించిందే. వారి పేరుతోనే ఇంట్లో దీపం వెలిగించుకుంటూ ఉంటాము?' అన్నాడు అప్పలస్వామి.

"రామ్మూర్తిపంతులు బిరుదిచ్చిన తహశీలుదారు. 'నీకు యోగ్యమైన బిరుదు ఇచ్చాడాయన. ఇంకేమీ సహాయం చెయ్యలేదా?' అన్నాను.

"ఎక్కడబాబూ! వారు వచ్చిన రెండుమాసాలకే బదిలీ అయారు' అన్నాడు, అప్పలసామి విచారంతో.

"నేను లోపలికిపోయి డబ్బు తెచ్చియివ్వబోయాను. అప్పలసామి తీసుకోలేదు. 'కిష్టయ్యగారిపెళ్ళికి మేళం చెయ్యనియ్యండి' అని వెళ్ళిపోయాడు.

"నిమ్మళంగా అప్పలసామిని గురించి చాలా సంగతులు తెలుసుకున్నాను. అప్పలసామి ఆచుట్టుపక్కలకి సన్నాయిలో మిగులట. మంచి విద్వాంసుడట. పిల్లలకి పాఠాలుకూడా చెప్పుకుంటాడట. ఇంకో విద్వాంసుడు వచ్చి ఆవూళ్ళో సన్నాయికర్ర పట్టలేడట. ఆనాడు శ్రీనాథుడు గౌడ డిండిమ భట్టు కంచుఢక్క పగులగొట్టించితే, ఈనాడు అప్పలసామి ఎంతోమంది సన్నాయికర్రలు పగలగొట్టించాడట. అప్పటి నించీ ఇతన్ని ఆశ్రయించిగాని, ఆవూళ్ళో ఇంకో మంగలి ప్రవేశించడట. అసలతని శిష్యుల ధాటకే ఆగలేరట.

"అప్పలసామిలో ఇంకో సుగుణముంది. (మీకు దుర్గుణం కావచ్చు) కిరస్తానీ ప్రభుత్వం వచ్చి ఆచారాలు మంట కలు

స్తున్న ఈ రోజుల్లో అతను సనాతనధర్మాన్ని నిలబెట్టటానికే పుట్టాడా అనిపిస్తుంది. అతను శాపభ్రష్టఋషి అని కొందరి సందేహం. కాక? బ్రాహ్మల్లోకూడా వాడిలాగా నిష్ఠగా ఉండేవాళ్ళు అరుదు. ఎంతోమంది వైదికులే వాడి ఆచారాలకి భయపడేవాళ్ళు; అప్పలస్వామిమాత్రం ఎవ్వరికీ భయపడడు. ఎంత అధికారి ఐనా, దుర్ముహూర్తంలో వాడిచేత క్షురకర్మ చేయించుకోలేడు. తిథులు, వారాలు, నక్షత్రాలు అన్నీ చూసుకునిగాని వాడు పొది తీసుకు బయలుదేరడు. వీడిమూలాన ఎంతోమంది అధికారులు పైఅధికారులదగ్గరికి అప్పుడప్పుడు మాసినగడ్డాలతో పోవలసివచ్చేది. ఐనా ఎవ్వరూ వాడివ్యవస్థ మీరేవాళ్ళుకారు. మీరితే, నైతికంగా వాళ్ళకి ఆ ఊళ్ళో మంచినీళ్ళు పుట్టవు. చాతుర్వర్ణాలు భగవంతుడి సృష్టి అని అప్పలసామి నమ్మకం. ఆ నమ్మకంలో ఆత్మవంచన ఏమీలేదు. అతని వ్యవస్థప్రకారం బ్రాహ్మలికి గోష్పాదమంత జుట్టూ, క్షత్రియులకి గడ్డమూ, వైశ్యులకి గిరజాలూ, శూద్రులకి జులపాలూ ఉంచేవాడు.''

'''జులపాలేమిటి, తాతయ్యా?' అన్నాను నేను.

''జులపాలు ఎరగవటరా? రెండు చెంపలనీ జుట్టుఉంటుంది- సుభాష్ బాబుబొమ్మ చూశా: సరిగ్గా అలాగా!—

''ఒకటీ అరా క్రాపులు ఆ ఊళ్లో కనపడుతూ ఉండేవి- పొరుగూరినించి వచ్చిన వాళ్ళవి. కుర్రవాళ్లు తమకుకూడా పెట్టించమని గోలచేస్తూ ఉండేవాళ్ళు. అప్పలసామి వినేవాడు కాదు. (అసలతనికి క్రాపువెయ్యటం చేతకాదు) పెద్దవాళ్ళ చేత చీవాట్లు పెట్టించేవాడు. అప్పలసామి మహాపట్టుదలగల

మనిషి. ఒకమాటు ఒక కిరస్తానీ అధికారి అప్పలసామిచేత మతవరం చేయించుకోవాలని చూశాడట. కాని, అతను ఒప్పుకోలేదు; లక్షరూపాయ లిచ్చినా నీ గడ్డం తడవనని వెళ్ళిపోయాడట. ఆతర్వాత ఆ అధికారి అప్పలసామికి అపకారం చెయ్యాలని చాలా చూశాడట. కాని, ఊళ్లో వాళ్లంతా కలిసి పిటీషను పెట్టి ఆ అధికారినే మార్పించి పారవేశారట. కారణాలు:—అతను హిందూమతానికి అపకారి అట—(శ్రీ) విక్టోరియామహారాణిగా రిచ్చిన మాటకు విరుద్ధంగా నడుస్తున్నాడట.

"ఇలా అప్పలసామి ఊళ్లో పెద్దల ఆదరం, అధికార్ల ప్రాపకం సంపాదించి, సాటివాళ్ళని తలెత్తనివ్వకుండా, తను తలెత్తుకుని తిరుగుతున్నాడు. అతనిబాణానికి అక్కడ అడ్డులేదు.

"నేను అక్కడ ఉంటున్న సంవత్సరంనర రెండు సంవత్సరాలకు చలిపిడుగులాగా సీనాయి అనే కుర్రవాడు ఆ ఊరు చేరాడు. వాడూ మంగలే. ఆ ఊరేనట. పూర్వం అప్పలసామి దగ్గర సంగీతంకూడా నేర్చుకున్నాడట. మొద్దు—ఎన్నాళ్ళు నేర్చుకున్నా పిల్లారిగీతాలే రాలేదట వాడికి. అప్పలసామికి విసుకుపుట్టి. వాడిచేతిలో కిర్రలాక్కుని, నీకీ జన్మలో సంగీతంరాదని వెళ్లగొట్టాడట. పాపం! తోటి విద్యార్థుల్లో వాడికి మొహం చెల్లక, ఉత్తరాది పారిపోయాడట. అక్కడ నాలుగేళ్ళుండి, గాలిసంగీతం, దానికి తాళం పాడూ ఉండదట నేర్చుకుని తిరిగివచ్చాడు. 'చల్ మోహనరంగా' 'ఆటలాడుకోరా'—ఇలాంటి పాటలు కమ్మగా వాయిస్తాడట. క్లారినెట్, ఫ్లూటుకూడా కొద్ది కొద్దిగా వాయిస్తాడట. సబ్బ

రాసి, క్షవరం చేస్తాడట. రకరకాల క్రాఫింగులు వేస్తాడట.

"మొదట వాడి విద్య వినేవాళ్లే లేక పోయారు ఆ ఊళ్ళో. అప్పుడు 'సీనాయి సినిమా బండిమీద చేరాడు. వాడికి వచ్చిన కీర్తనలన్నీ క్లారినెట్ మీదవాయిస్తూ ఊరంతా తిరిగేవాడు. వాడి సంగీతం మీద ప్రజలకు అభిరుచి కలిగింది. కొంత మందికోరి వాడిబండి నాపించి, కీర్తనలు వినిపోతూ ఉండే వాళ్ళు. అంతమాత్రం తాహతు లేని కుర్రవాళ్ళు బండి వెంటేపోయి, వినివస్తూ ఉండేవాళ్లు. వాడికి జాతి భేదా లేమీ లేవు. హిందువులు క్రాపు చేయించుకోకపోతే, కిర స్తానీవాళ్ళకి చేసేవాడు. ఇలా రెండుమూడు మాసాలు గడిచినాక, వాడు ఆఊళ్లో సెలూన్ పెట్టాడు. వాడికి వేళా పాళా లేదు. తిథివారాల పట్టింపు లేదు. బ్రాహ్మణ అబ్రా హ్మణ భేదం లేదు. వాడు జాతికత్తులు వాడేవాడు, గడ్డానికి సబ్బుపట్టించేవాడు, తలకి నూనె రాసేవాడు. షాపులో పెద్ద పెద్ద అద్దాలు, ఘుమఘుమలాడే తలనూనెలూ, తగిలితే మెరుగువచ్చే సోప్లూ ఉంచాడు. వాడు కుర్చీమీద కూర్చో బెట్టిగాని, క్షవరం చేసేవాడు కాదు.

"షాపులో రెండుమూడు మాసాలవరకు వాడికేమీగిట్టు బాటు కాలేదు. కాని క్రమంగా వాడికి బేరం ఎక్కింది. కుర్రవాళ్ళు చాటుగా బేడడబ్బులు కాజేసి, వాడిదగ్గర గొరి గించుకొస్తూ ఉండేవాళ్లు. ఒకళ్లిద్దరు—పైన పెద్దతలలు లేని వాళ్లు—వాడిచేత క్రాపింగులు చేయించుకున్నారు. మరో పదిరోజులకి ఇంకా యిద్దరు కలిశారు. ఇలా చూస్తూండగానే చాలామంది కుర్రవాళ్ళూ, కొందరు పెద్దవాళ్లూ క్రాపులు

పెట్టించి వేశారు. ఎంతో కాలంనించి అప్పలసామి తనశక్తి సంతా ధారబోసి నిలుపుకుంటూ వచ్చిన ఆచారాలూ, వర్ణ వ్యవస్థా పేకయిల్లులాగా కూలిపోయింది. ఇప్పు డతనిచేత పెద్దవాళ్లు ఏ నలుగురో తప్ప, కుఱ్ఱవాళ్లు అసలు క్షవరం చేయించుకోటం లేదు. పెద్దవాళ్లు 'ఎందుకు చేయించుకో' వంటే 'మాతలలు వంగదీసి తొడమీద పెట్టుకుంటాడు నాన్నా! సీనయ్య చక్కగా, తలెత్తుకున్నా, చేస్తాడు' అనేవాళ్లు.

"ఆరునెల్లకే సీనాయి సీనయ్య ఆయాడు! అప్పల సామి అప్పన్న అయాడు!

"ఒకనాడు అప్పలసామిని పిలిపించి, ఒక ఘంట మాట్లా డాను. కాలానుగుణ్యంగా నడుచుకోవాలనీ, మారాలనీ ఉపదేశించాను. అప్పలసామికి నా ఉపదేశం ఎక్కలేదు. నేను మళ్ళీ మార్చి చెప్పాను.:-'అప్పలసామీ! నీకు ఫలాని విద్య తెలియదు అని ప్రజ లభిప్రాయపడకూడదు. అలా అనుకుంటే, నువ్వు వాళ్ళ దృష్టిలో తగ్గిపోతావు. నువ్వు ప్రజ లను 'నేనూ క్రాపులు వెయ్యగలను, గ్రాంఫోనుపాటలు వాయించగలను', అని నమ్మించాలి. ఒకటి రెండు వాయించి చూపినాక 'నాకు గాలిపాటలు ఇష్టంలే'దని మానుకో వచ్చును. అప్పుడు ప్రజలు నిన్ను మెచ్చుతారు. 'నే నసలే వాయించ'నంటే నీకు చాతకాదని సులభంగా అనేస్తారు. ఏమంటావన్నాను.

"అప్పలసామికి ఈమాటలు నచ్చినై. తర్వాత రెండు మూసాలవరకూ అతను నాకు కనపడలేదు. క్షవరం చేయ

టానికి వచ్చిన వాడి తమ్ముణ్ణి అడిగితే, కూతురుగారింటికి, తూర్పుకి పోయాండని చెప్పాడు. అప్పలసామి ఊళ్ళో లేక పోవడంచేత సీనాయిపార్టీ ఇంకా బలపడింది.

"అప్పలసామి తిరిగివచ్చాడు—గ్రాంఫోను పాటల్లోనూ క్రాఫింగులు చేయుటంలోనూ తయారై. ఒకరిద్దరు కుర్ర వాళ్ళకు క్రాపులువేశాడు అప్పలస్వామి. వాళ్ళు బజారికి వెళ్లితే మిగతా పిల్లలు 'ఎక్కడ వేయించుకున్నావురా?' అని అడగటం, చెప్పితే 'పనసకాయ డిప్ప పెట్టినట్లుగా ఉందిరా' అని ఎగతాళి చెయ్యటం. నిజానికి ఎక్కువ అల వాటు లేకపోవటంచేత అప్పన్న వేస్తే క్రాపు బాగా కలి సేదికాదు. ముసలివాడు కావటంవల్ల ఒక ళ్ళిద్దర చెవులు కూడా కత్తెరకు పట్టించాడట. నేను ఒకనాడు అప్పల సామికి 'ఉద్యోగం' మానెయ్యమని చెప్పాను. పెద్దవాడి వయ్యావు, పేరు సంపాదించావు. ఏదో నాబోటి నలుగు రికి గొరుక్కుంటూ మిగతా యిళ్ళు తమ్ముడికి వదిలెయ్య మన్నాను, అప్పలసామి వొప్పుకున్నాడు. కాని, తనచేత ఒక కచ్చేరీ చేయించి, ఏదో...అన్నాడు. నేను తతిమా పెద్దలను కూడా కలుసుకోమన్నాను.

"ఒకనాటి రాత్రి వెంకటపతిరాజూ, పోలిశెట్టీ, పెద్ద రెడ్డీ నాదగ్గరికి వచ్చారు. అప్పలసామి పెద్దవాడయిపోతు న్నాడనీ, అతనిచేత కచ్చేరీచేయించి, సన్మానించవలసిన సమయం ఆసన్నమైందనీ చెప్పారు. నేను ఆలాగే నన్నాను. బిరుదు ఏది యివ్వాలనికూడా తర్కించాము...'నాద బ్రహ్మ' 'నాదముని' 'గానలోల' 'గానరాజ' మొదలైన

వెన్నో అనుకున్నాము—తోసివేశాము. ఆఖరికి 'నాదకేసరి' అని యివ్వ నిశ్చయించాము. ఈ బిరుదు ప్రపోజ్ చేసింది పెదరెడ్డి—ఇది అప్పలస్వామికి ఇష్టమనికూడా చెప్పాడు. ఇంకేం, నిశ్చయమైనాక కాగితాలు వేసి దూరదూరాలకి పంపించాము. పత్రికల్లోకూడా వేయించాము.

'సభ దివ్యంగా జరిగింది. దూరదూరాల్నించి విద్వాంసులొచ్చారు. జాతీయనాయకులు కూడా వచ్చారు. అప్పలసామి ఆవాళమాదిరిగా ఎన్నడూ వాయించలేదట. ఎత్తుకోవటం 'పున్నాగ'రాగం ఎత్తుకున్నాడు. పున్నాగ వాడి సొమ్ము. వాయించాడు, వాయించాడు, కర్రా, మనిషీ వలయాలుతిరిగాడు. మాకు ఆశ్చర్యమూ, జాలీ వేసింది. తర్వాత ఏదో కీర్తన ఎత్తుకున్నాడు. పదమూడు అక్షరాల తాళమట దానికి-డోలుకాడు వాయించలేక వదిలేశాడు. అక్కడ ఉన్న విద్వాంసులూ, నాయకులూ అంతా డంగయిపోయారు. నేను లేచి 'అప్పలసామి ఆంధ్రదేశంలో కెల్లా గొప్ప విద్వాంసుడనీ, త్యాగయ్యకు అపరావతారమనీ మాగ్రామస్థులు నమ్మారు. అతన్ని సత్కరించటం ఆంధ్రుల్ని సత్కరించటమే ననికూడా మానమ్మకం. ఈసభలో అప్పలసామికి 'నాదకేసరి' అని బిరుదివ్వదలిచాము. దీనికి ఆక్షేపణ ఉన్నవాళ్లు తెలియబరచవలసింది. లేదా, అప్పలసామిని విద్యలో జయించవలసింది' అన్నాను. ఎవ్వరూ మాట్లాడలేదు. అప్పలసామి వాయించిన కీర్తనేమిటో అక్కడున్న విద్వాంసులకి కూడా తెలియలేదు. ఐనా, అప్పలసామిని సత్కరించినందుకూ, బిరుదిచ్చినందుకూ

వాళ్లందరికీ కష్టంగానే ఉంది. మేము బిరుదుతోపాటు అప్పలసామికి ధోవతులచాపు పెట్టాము, ఏకశాలువ ఇచ్చాము. సభ ముగుస్తూఉండగా, పెదరెడ్డి లేచి 'అప్పలసామీ! ఏదీ, కాస్త గాలిసంగీతంకూడా వాయించి చూపించు!' అన్నాడు. అప్పలసామి 'కోరిభజింతున్' కర్ర మీదవేశాడు. దానికే పల్లవి, అనుపల్లవి వేసి అరగంట వాయించాడు. కాని ప్రేక్షకుల ముఖాన తృప్తి కనపడ లేదు. నేను లేచి ఇంకోటి వాయించమన్నాను.

''అప్పలసామి 'ఏదీ గతీ నాకూ' అని ఎత్తుకున్నాడు. కుర్రకారులో నవ్వులు బయలుదేరినై. అప్పలసామి గిరికీలు తిప్పి వాయించుకుంటూనే పోతున్నాడు. భక్తిరసం తొణికిసలాడుతోంది. ఆ కీర్తన గజేంద్రుడి పరంగా తీసుకుని, అద్భుతంగా వాయించాడు. కాని, సభలో చాలామంది అతని పాటమీద ధ్యానం ఉంచలేదు. కొంతమంది మధ్యను కూడా వెళ్లిపోయారు, కచ్చేరీ పూర్తి అయింది. ఎవరిళ్లకు వాళ్లు పోయారు. దూరాన్నించి వచ్చినవాళ్లను తగుమర్యాద చేసి పంపివేశాము.

''అంతా సక్రమంగానే జరిగింది. కాని, ఆ రోజునించీ పిల్లలికి అప్పలసామి అంటే అలుసైపోయింది. అతను కన పడితే చాలు 'ఏదీగతినాకూ, రంగ, రంగ' అని పాడటం మొదలుపెట్టేవాళ్లు! మొదట కొన్నాళ్లు తన్ను ఎగతాళి చేస్తున్నారని అప్పలసామి గ్రహించలేదు. విని' ఆగి, వాళ్ల తప్పులు దిద్ది, యిట్లా పాడమనేవాడు. పాపం! ఇదంతా సీనాయి చేయిస్తున్నాడని ఆ అమాయకుడికి తెలియదు.

అప్పన్నా నీపాట బాగా ఉందంటే, ఉబ్బిపోయేవాడు. అప్పలసామీ నీపాట బాగలేదంటే కొట్ట వచ్చేవాడు—వాడికడుపులో అరలేమీ లేవు.

"అక్కడి కక్కడికి దుర్భరమైంది, అప్పలసామి ఆ ఊళ్ళో ఉండడం. వాడేకాదు, వాడికి తోమత్తుఉన్న మేముకూడా. మాలో ఎవరు కనపడ్డా 'రంగా, రంగా, ఏదీ గతి నాకూ' ఎత్తుకునేవాళ్ళు. ఆవాళ అప్పలసామి వాయిస్తుంటే 'సెబాస్' అన్నాము మేము. అన్నదాంట్లో తప్పేముంది?—పదిమంది కలిస్తే ఎచ్చివాణ్ణి పిచ్చివాణ్ణి చెయ్యవచ్చు! ఆలాగే మమ్మల్ని ఉడికించి, పిచ్చివాళ్ళని చెయ్యాలని చూశారు! నిజానికి అప్పలసామికంటే గొప్ప విద్వాంసుడెవడు? వాడువేసే సంగతులు ఎవ్వరికీ అర్థంకూడా కావే-వాడి తమ్ముడు చెప్పుతూ తిరగకపోతే.

"నాకు అప్పుడు కుర్రవెధవలమీద నిజంగా చాల కష్టమేసింది. రాజూ వగైరాలను పిలిపించాను. రెండుమూడు గంటలు చర్చించి కర్తవ్యం నిర్ణయించాము. అప్పలసామి కన్నుమూస్తే, కర్ణాటకసంగీతం అస్తమిస్తుంది. వాడిచేత స్కూలుపెట్టించి కర్ణాటక సంగీతాన్ని లుప్తంకాకుండా, ఉంచాలి. దీని కయ్యేఖర్చు చందాలద్వారానూ రాజుగారి దగ్గరా వసూలు చేద్దామనుకున్నాము.

"పని ప్రారంభించాము, రాజుగారు పాఠశాలకు భవంతి కట్టిస్తున్నారు. తయారుకూడా కావచ్చింది, కాని, ఊళ్లో కుర్రకారుగోల ఏమీ తగ్గలేదు...అప్పన్నకూడా తన్ను వెక్కిరించిన వాళ్ళని తిట్టుతూ తిరగటం మొదలు పెట్టాడు.

తిండి తినడు. నిద్రలోకూడా అప్పుడప్పుడు లేచి సీనాయినీ, గాలిసంగీతాన్నీ తిట్టుతూ ఉండేవాడట.

"ఇంతలో ఒక దుర్ఘటన జరిగింది. సెట్టిగారి అబ్బాయి పెళ్లి. వాడు సీనాయిమేళం పెడితేనేగాని, పల్లకీ ఎక్కనని కూర్చున్నాడు! మేమంతా చెప్పిచూశాము. లాభం లేక పోయింది. వాడిని పట్టిన గ్రహాలు మా మాటలు చెవి దూరనివ్వలేదు! పాపం! అప్పన్న రెండురోజులు తిండి తిన కుండా వాళ్లింటిదగ్గర కూర్చున్నాడు. శెట్టిగా రబ్బాయిని బతిమాలుకున్నాడు. తన విద్య సంగతి చెప్పాడు. గ్రాంఫోన్ రికార్డులుకూడా వాయిస్తానన్నాడు...తనకు మేళం యివ్వక పోతే, చచ్చిపోతా నన్నాడు. లాభం లేకపోయింది. శెట్టి గారబ్బాయి వినలేదు.

"ఆనాటినుంచీ అప్పలసామి పేలిపోవడం మొదలు పెట్టాడు. కనపడ్డవాళ్ళనల్లా నిలబెట్టడం, గాలిసంగీతాన్ని తిట్టడం!—వినకుండా పోతుంటే, వాళ్ళకి సంగీతజ్ఞానంలేదని అనటం!...ఇలా అన్నం నీళ్ళూ లేకుండా తిరగటం మొదలు పెట్టాడు. అదే అప్పన్నకి మతిపోవటం!—వాణ్ణి నమ్మి చేసిన మా ప్రయత్నాలన్నీ వృథా అయిపోయినై!"

" 'సీనాయి ఏమయ్యాడు?' అని అడిగాను నేను.

"ఏమయ్యాడు! శ్రీనివాసుడయాడు! అప్పుడువచ్చి, కొట్టుముందు నిల్చుని గ్రాంఫోను సంగీతాన్ని తిట్టుతూ ఉంటే, నవ్వుతూ ఉంటాడు!"

" 'పాఠశాల భవంతి ఏమయింది?'

"రాజాగారి పశువులు సామవేదం చెప్పుకుంటున్నై."